ఈనాడు
యాదాద్రి భువనగిరి
ఆదివారం సెప్టెంబరు 29, 2024

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు: డీఈవో



ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీల ప్రారంభ కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ

ఆలేరు, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యంతో పాటు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి కందుల సత్యనారాయణ అన్నారు. ఆలేరు పట్టణంలో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్‌బాల్ బాలురు, బాలికల జట్ల(అండర్-17) ఎంపిక పోటీలు ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులకు కొదువలేదన్నారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులకు క్రీడల్లో మంచి తర్ఫీదు ఇవ్వాలన్నారు. యాదాద్రి, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన 350 మందికి పైగా బాలురు, బాలికలు పోటీల్లో పాల్గొని క్రీడా నైపుణ్యం చాటడం అభినందనీయమన్నారు. ఎంపికైన జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ యాదాద్రి జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ ప్రకటించారు. ఆలేరు పుర ఛైర్మన్ వస్పరి శంకరయ్య హెచ్‌ఎంలు డి.మంజుల, ఎ.వేణుగోపాల్, పూల నాగయ్య, జి.మధుసూదన్, రీటా వసంతకుమారి పాల్గొన్నారు.

సేవాభావం పెంపొందించేందుకు పోటీలు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించేందుకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని సేవా మహా యజ్ఞం జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్‌రెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్త అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సేవా పఖ్వాడా పోటీలను ఆయన ప్రారంభించారు. పోస్టర్ ప్రజెంటేషన్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ బట్టు క్రాంతి, నాయకులు మహమూద్, మంగు నర్సింహారావు, దాసరి స్వామి, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ ప్రకటన జారీలో జాప్యం కొనసాగింది. ఇతర శాఖల మాదిరిగా కాకుండా పోలీసు శాఖలో తరచూ నోటిఫికేషన్లు వెలువడేవి. ఉత్తమమైన మార్కులు లేకున్నా సగటు డిగ్రీ విద్యార్థి కూడా మైదానంలో ఒళ్లువంచి కష్టపడితే పోలీసు ఉద్యోగం లభించే పరిస్థితులు ఉండేవి.

సుమారు 15 ఏళ్ల క్రితం జిల్లాలో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం, పరిశ్రమల స్థాపన కూడా అంతంత మాత్రమే కావడం, జిల్లాలో కొంతమేర వ్యవసాయరంగం సానుకూలంగా ఉండటం, మరికొంత మేర కరవు తాండవించడం, ముఖ్యంగా రైతు కుటుంబాలు ఆర్థికంగా బలంగా లేకపోవడం వంటి సామాజిక స్థితిగతులు జీవితంలో ఏదో ఒక ఉద్యోగాన్ని సాధించాలనుకునే యువతకు పోలీసు ఉద్యోగాలు ఒక మహదవకాశంగా కనిపించాయి.



వామపక్ష రాజకీయాల ప్రభావంతో యువతలో అన్యాయాన్ని ధిక్కరించే ధోరణి అలవడింది. దీంతోపాటు వారిలో సేవా దృక్పథం కూడా ఉండటం కూడా పోలీసు ఉద్యోగాల వైపు వారు దృష్టి సారించే పరిస్థితులు కలిగాయి.


1980ల ప్రారంభం నుంచి సుమారు 2005 వరకు జిల్లాలో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు అధికంగా ఉండేవి. జిల్లాలో నిరుద్యోగ యువత అటువైపు ఆకర్షితులు కాకుండా పోలీసు ఉద్యోగాల వైపు యువతను ఆకర్షించడానికి ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు వెలువరించేది. ఉద్యోగార్థుల్లోని ఔత్సాహికులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కూడా ఇచ్చేవారు. ఇష్టంతో పోలీసు శాఖలోకి వెళ్లిన వారు తమ కుటుంబాలకు దన్నుగా నిలిచారు.

జీవితంలో త్వరగా స్థిరపడాలని..



డిగ్రీ పూర్తి చేయగానే కుటుంబ పరిస్థితుల రీత్యా ఏదో ఒక ఉద్యోగం సాధించి, కుటుంబానికి అండగా నిలబడటంతో పాటు జీవితంలో త్వరగా స్థిరపడాలనే ఆలోచనతోనే తాను పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకున్నానని చెపుతున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకికి చెందిన **షేక్ జహంగీర్.** ఆయన ప్రస్తుతం దక్షిణ మండల అదనపు డీసీపీ, హైదరాబాద్ సిటీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1990లో కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణలో ఉండగానే ఎస్సై పోస్టుకు పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. 2007లో సీఐగా, 2017లో డీఎస్పీగా, 2023లో అదనపు డీసీపీగా పదోన్నతి పొందారు. ఆవేశంతో పాటు ఆలోచనపరులుగా ఉండే జిల్లా వాసుల్లో సామాజిక స్పృహ సహజంగానే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అవసరం..అభిమానం..



తన కుటుంబ పరిస్థితులతో పాటు ఆ శాఖపై ఉన్న అభిమానం తనను పోలీసు ఉద్యోగం వైపు మళ్లించాయని తెలిపారు నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన **జాల మల్లేశ్.** ఆయన ప్రస్తుతం రాష్ట్ర ఆక్టోపస్ విభాగంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పేద కుటుంబం కావడంతో ఎస్టీడీ బూత్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డిగ్రీ పూర్తి చేశారాయన. చిన్నప్పటి నుంచి ఏదైనా సాధించాలని, అది నలుగురిలో ఒకరిగా కాకుండా ప్రత్యేకంగా ఉండాలని కోరుకునే వాడినని మల్లేశ్ పేర్కొన్నారు. 2007లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై, 2009లో రిజర్వ్ ఎస్సైగా ఎంపికై ఆక్టోపస్‌కు వెళ్లానని, 2017లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి (హైదరాబాద్) లభించిందన్నారు.



– చిట్యాల, న్యూస్‌టుడే


దారులు ఛిద్రం.. జర భద్రం

భువనగిరి, తుర్కపల్లి(ఎం), న్యూస్‌టుడే: జిల్లా మీదుగా పలు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. పలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి.

❖ చిట్యాల- భువనగిరి, భువనగిరి- జగిదేవ్‌పూర్ రహదారి పూర్తిగా గుంతల మయం అయింది. చిట్యాల నుంచి భువనగిరి వరకు నల్లరేగడి భూముల కావడం చిన్నపాటి వర్షాలకే దెబ్బతింటున్నాయి. పరిమితికి మించిన 20 టన్నులకు పైగా లోడుతో భారీ వాహనాలు ట్రక్కుల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. భువనగిరి-జగిదేవ్‌పూర్ మార్గం రహదారి కూడా అధ్వానంగా మారింది. కేవలం 10 టన్నుల పరిమితిని దృష్టిలో పెట్టుకుని వేసిన రోడ్లపై 20 టన్నుల లోడు గల వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో మూలమలుపులు, అక్కడక్కడా పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి.



జాతీయ రహదారి 161 ఏఏపై తుర్కపల్లి మండలం జేతురాం తండా సమీపంలో ఏర్పడిన లోతైన గుంత



తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో సంగ్యతండా వద్ద తండా జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతను గ్రామస్థులే మట్టితో పూడ్చిన దృశ్యం

❖ రుస్తాపూర్ నుంచి వాసాలమర్రి వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సంగ్యాతండా వద్ద గుంత ఏర్పడి ద్విచక్రవాహనదారులు గాయపడిన ఘటనలు ఉన్నాయి.

❖ చౌటుప్పల్-సంగం-బొల్లెపల్లి-నాగిరెడ్డిపల్లి-భువనగిరి- తుర్కపల్లి రహదారిని ఏడాది క్రితమే జాతీయ రహదారుల విభాగానికి బదలాయించి 161ఏఏగా నామకరణం చేశారు. నిర్వహణను గాలికి వదిలేశారు.

❖ భువనగిరి- రాయగిరి మధ్యన ఆరు కిలోమీటర్ల మేర జిల్లా రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల నుంచి రాయగిరి వరకు ఇటీవల వర్షాలకు రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి.

నిధులొచ్చినా..

ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతులు, పంట నష్టం, కూలిన ఇళ్లకు పరిహారం ఇచ్చేందుకు జిల్లాకు రూ.3 కోట్లను ప్రభుత్వం సెప్టెంబరు మొదటి వారంలోనే మంజూరు చేసింది. యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు చేపట్టకపోవడం గమనార్హం.

తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం

– సైదులు, ఏఈఈ ఆర్‌అండ్‌బీ, భువనగిరి సెక్షన్

ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాం. నాగిరెడ్డిపల్లి నుంచి వలిగొండ వరకు రహదారిపై ఏర్పడిన గుంతలన్నీ రెండురోజుల క్రితమే పూడ్చివేశాం. భువనగిరి-రాయగిరి రహదారి బీటీ రెన్యూవల్ చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. 20 రోజుల కిత్రం ప్యాచ్ వర్క్ చేశాం. గుంతలు ఉంటే మిగిలిన వాటిని కూడా పూడుస్తాం. భువనగిరి-జగిదేవ్‌పూర్ రహదారి ఎన్‌హెచ్ పరిధిలో ఉంది.

యాదాద్రి క్షేత్రంలో ఏకాదశి ఆరాధనలు

యాదగిరిగుట్ట: ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువుదీరిన మూలవరులను కొలుస్తూ పంచామృతంతో నిజాభిషేకం చేపట్టిన పూజారులు తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను ఆరాధిస్తూ ఏకాదశి వేడుకగా లక్ష పుష్పాలతో ప్రత్యేక క్రతువు చేపట్టారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ పర్వాన్ని విష్వక్సేన పూజతో నిర్వహించి, కల్యాణమూర్తులతో గజవాహనం సేవోత్సవం చేపట్టారు. సాయంత్రం అలంకార సేవలను మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించారు. రాత్రి స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన జరిపారు. దర్బారు సేవోత్సవంలో నిత్యాదాయం వెల్లడించారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ఏకాదశి ఆరాధనలు చేపట్టారు. కొండపై శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యారాధనలు శైవాగమ ఆచారంగా కొనసాగించారు. వివిధ విభాగాల నుంచి రూ. 19,02,687 ఆదాయం సమకూరిందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

కేసుల రాజీ తర్వాత స్నేహపూర్వకంగా మెలగాలి

❖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌లో కేసుల రాజీ తర్వాత స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు అన్నారు. భువనగిరిలో కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉచిత న్యాయసేవలు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయసేవాధికార సంస్థ సేవలను విస్తృతం చేశామని, లోక్ అదాలత్ బెంచీలతో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేసును రాజీ చేసుకున్న దంపతులను అభినందించి వారికి రాజీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత, ప్రధాన జూనియర్‌సివిల్ జడ్జి నాగేశ్వరరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఉపాధ్యక్షురాలు జయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు, చిత్రంలో జడ్జిలు మాధవిలత, నాగేశ్వరరావు, కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్

11,066 కేసులు పరిష్కారం.. లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన తొమ్మిది బెంచీలలో క్రిమినల్ కేసులు 3,459, సివిల్ కేసులు 17, ప్రీలిటిగేషన్ కేసులు 73, ట్రాఫిక్ చలానా కేసులు 7,517 మొత్తం 11,066 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు తెలిపారు.

విద్యుత్తు సంస్థలో బదిలీల సందడి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో బదిలీల సందడి ప్రారంభమైంది. అర్హులైన ఉద్యోగుల జాబితాను క్యాడర్ల వారీగా శనివారం రాత్రి డీఈ, ఎస్ఈ కార్యాలయాల వద్ద ప్రదర్శించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యలో 50 శాతం మందిని బదిలీ చేయనున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన వారు అర్హులు. అక్టోబరు 4వ తేదీ వరకు ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 7న బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. 8వ తేదీ నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి రానుంది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు కొత్త స్థానాల్లో పదో తేదీ వరకు చేరాల్సి ఉంది.



ఎస్ఈ కార్యాలయం

అర్హులు వీరే... సంస్థలో క్షేత్రస్థాయిలో, కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు డీఈ, ఎస్ఈలు బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. జిల్లా పరిధిలోని నలుగురు ఏఈలు, 20 మంది సబ్ ఇంజినీర్లు, నలుగురు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఫోర్‌మెన్లు, 12 మంది జేఏవోలు, 18 మంది సీనియర్ అసిస్టెంట్లు, 24 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, తొమ్మిది మంది ఆఫీస్ సబార్డినేట్లు బదిలీ కానున్నారు. భువనగిరి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జేఎల్‌ఎంలు, 14 మంది ఏఎల్‌ఎంలు, 64 మంది లైన్‌మెన్‌లు, 13 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు స్వీపర్లు బదిలీకి అర్హులుగా గుర్తించి అధికారులు జాబితాను ప్రదర్శించారు. రాత్రి పొద్దుపోయే వరకు చౌటుప్పల్ డివిజన్‌లో బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితా ప్రదర్శించలేదు.

వేగంగా ధరణి దరఖాస్తుల పరిష్కారం

భువనగిరి, న్యూస్‌టుడే: ధరణి దరఖాస్తుల్లో అన్ని వివరాలను పరిశీలిస్తూ వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆయన రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వాల్టా చట్టంపై సమీక్షించారు. ధరణి ఫైళ్ల పరిష్కారం నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ వాల్టా చట్టంపై గ్రామాలు, అర్బన్ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఇళ్ల అవసరాలు, కమర్షియల్ అవసరాలకు బోరుబావులు వేయాలంటే తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, భువనగిరి ఆర్డీవో అమరేందర్, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్ పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియల్లో విశేష కృషి చేసిన ఎనిమిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహేకు బహూకరించనున్నారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి అవార్డును డాక్టర్ భాస్కరాయోగికి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారాన్ని మోత్కూరి నరహరికి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎన్ భక్తవత్సలరెడ్డికి, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని నాగవరం బాలరామ్‌కు, డా.వానమామలై వరదాచార్యుల పురస్కారాన్ని డాక్టర్ వెల్దండ సత్యనారాయణకు, ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారాన్ని రేడియం (జె.కొండన్న)కు, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు అందజేయనున్నారు. వచ్చే నెల 4న సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ బొగ్గులకుంటలోని పరిషత్ ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

నాటి విద్యార్థి.. నేడు ప్రధానోపాధ్యాయుడు

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మదిర గ్రామం మల్లేపల్లికి చెందిన సుంకోజు భాస్కర్ తాను విద్యనభ్యసించిన చోటే ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. తదుపరి హైదరాబాద్‌లో ఉన్నత చదువులు బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా (ఎస్ఏ, సైన్స్)ఎంపికయ్యారు. రాజపేట మండలం రఘునాథపురం, యాదగిరిగుట్ట, ఆత్మకూర్, చందుపట్లలో పని చేశారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో భాగంగా వలిగొండ శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ప్రస్తుతం వలిగొండ మండల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా ఇలాంటి అవకాశం కొందరికి మాత్రమే లభిస్తుంది.



సుంకోజు భాస్కర్

✦ నాటి ఉపాధ్యాయులు పటిష్ఠమైన ప్రాథమిక, హైస్కూల్ విద్య అందించడంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పని చేస్తున్నందుకు సంతోషంగా, గర్వంగా ఉందని చెబుతున్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థులను సంఖ్యతో పాటు పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రణాళికబద్ధంగా వ్యవహరించి మండలంలో సర్కార్ బడుల బలోపేతం చేసి జిల్లాలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఎస్.భాస్కర్ తెలిపారు. **– న్యూస్‌టుడే, వలిగొండ**



కేఎల్ఎన్ బాలుర కళాశాలలో రాంనగర్ బన్నీ సినిమా హీరో చంద్రహాస్, హీరోయిన్ విస్మయశ్రీ. చిత్ర బృందం

రాంనగర్ బన్నీ సందడి

వచ్చే నెల 4న విడుదల కానున్న 'రాంనగర్ బన్నీ' సినిమా బృందం శనివారం మిర్యాలగూడ పట్టణంలో సందడి చేసింది. కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో చంద్రహాస్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచా జోషి, చిత్ర యూనిట్ పాల్గొన్నారు. చిత్రంలోని పలు సన్నివేశాల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ మహత్, నిర్మాత మలయజ ప్రభాకర్, అంబికా వాణి, కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ

చిక్కింది.. బంగారు చేప

శాలిగౌరారం ప్రాజెక్టులో గాలంతో చేపలను పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడికి బంగారు వర్ణం కలిగిన చేప చిక్కింది. ఏ చెరువులోనైనా పాంప్లేట్ చేప నల్ల వర్ణంలో ఉంటుంది. కానీ దానికి భిన్నంగా బంగారు వర్ణంలో ఉండడం అరుదని మత్స్యకారులు చెబుతున్నారు.



న్యూస్‌టుడే, శాలిగౌరారం

ప్రాణం పెట్టి.. పాఠం చెప్పేటోళ్లకు వందనం: డా.అందెశ్రీ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: నెలవారీ జీతాల కోసం కాకుండా, బడుగు జీవుల భవిష్యత్తు కోసం ప్రాణం పెట్టి పాఠం చెప్పే ఉపాధ్యాయులందరికీ దండం పెడతానని లోక కవి డా.అందెశ్రీ అన్నారు. విశిష్ఠ మహిళ, కీర్తి రత్న, ఉత్తమ పాఠ్య పుస్తక రచయిత డా.బండారు సుజాత శేఖర్ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా శనివారం హాజరై మాట్లాడారు. అక్షరాన్ని ఎవరు మడి కట్టుకుంటారో, తలపై ఇరుముడి కట్టుకుంటారో వాళ్లకు శరణాగతి చెప్తానన్నారు. ప్రభుత్వ బడుల్లోకి వచ్చేది పిల్లలు కాదని, దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్లని తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య సరస్వతి మాత చిత్రపటానికి పుష్పార్చన చేసి జ్యోతిని వెలిగించారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి, ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో, రచయిత్రిగా బహుముఖ సేవలందించిన సుజాత అభినందనీయురాలని మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ స్కూల్ కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్ అధ్యక్షత వహించారు. ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్, రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, 'ఐపోస్' రాష్ట్ర కన్వీనర్ కేవీఎల్, ప్రభాకర్, దేవేందర్, అయోధ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో డా.సుజాతశేఖర్ పదవీ విరమణ సన్మాన సభలో జ్యోతి వెలిగిస్తున్న లోక కవి అందెశ్రీ, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్ తదితరులు

యువకుడి దారుణ హత్య

డిండి, న్యూస్‌టుడే: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన డిండి మండలం చెర్కుపల్లి గేటు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(34)ని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చేతులు, కాళ్లను తాడుతో కట్టేసి.. నోరు, కళ్లను చున్నీతో చుట్టారు. అనంతరం బండరాళ్లతో తలపై కొట్టి హత్యచేసి చెర్కుపల్లిగేటు సమీపంలో చెట్ల పొదల్లో పడేశారు. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. డీఎస్పీ గిరిబాబు, డిండి, చందంపేట, నేరెడుగొమ్ము ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లు చేరుకొని ఘటనా స్థలిని పరిశీలించారు. హత్య చేసిన వ్యక్తులను గుర్తించేందుకు లభ్యమైన ఖాళీ బీరు సీసాలపై వేలి ముద్రలు సేకరించనున్నట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. డిండి, దేవరకొండ ప్రధాన రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



డిండి: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గిరిబాబు

ఎంజీయూ పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పీజీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాల్లో 72శాతం ఉత్తీర్ణత, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 56.27 శాతం, రెండో సెమిస్టర్‌లో 63.75 శాతం, మొదటి సెమిస్టర్‌లో 38.5శాతం ఉత్తీర్ణత సాధించారు. పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎంజీయూ ఓఎస్డీ కె.అంజిరెడ్డి, సీవోఈ ఉపేందర్ రెడ్డి, సంధ్యారాణి, భిక్షమయ్య, పాల్గొన్నారు.



ఎంజీయూ పీజీ ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ అల్వాల రవి, తదితరులు

◆ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ కంట్రోలర్‌గా రామచందర్‌గౌడ్, కో- ఆర్డినేటర్‌గా డా.భిక్షమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఆదేశాలు జారీ చేశారు.

వీర విజయం..!

◆ వయసు గడువుకు నెల ముందు దరఖాస్తు.. 48 ఏళ్లకు కొలువు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబం.. ఆపై అడుగడుగునా అపజయాలతో నిరుత్సాహం.. అయినా పట్టువదలని ధీరత్వం.. చదువు పూర్తయిన 17 ఏళ్లకు.. అదీ ఉద్యోగ వయసు గడువుకు కేవలం నెల ముందు దరఖాస్తు చేసి.. 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి యువతకు సవాల్ విసిరి.. అన్ని వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు మిర్యాలగూడ మోటారు వాహనాల తనిఖీ అధికారి లాల్‌కోట వీరస్వామి. ఆయన 'న్యూస్‌టుడే'తో తన జీవిత విశేషాలు వివరించారు.



లాల్‌కోట వీరస్వామి

వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో..

మాది నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం కుర్మిద్ద. అమ్మానాన్న లాల్‌కోట కృష్ణయ్యగౌడ్, దేవమ్మ వ్యవసాయ కూలీలు. అమ్మ పాచి పని కూడా చేసేది. ప్రాథమిక విద్య గ్రామంలో, ఏడు, ఎనిమిది తరగతులు పక్క గ్రామంలో పూర్తి చేశాను. ఉన్నత విద్య కోసం ప్రభుత్వ వసతిగృహంలో చేరగా.. అక్కడి నాణ్యత లేని ఆహారం, వాతావరణంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇక్కడ ఉండగానే వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో కార్మికుడిగా పనికి వెళ్లేవాడిని. ఇంటర్ పూర్తయిన తర్వాత ఇక చదివించే స్థోమత లేకపోవడంతో. . అమ్మ ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి.. ప్రభుత్వ కళాశాలలో ఆటో మొబైల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఈ సమయంలో సెలవు రోజుల్లో హాస్టల్ లేక తిండి కోసం అనేక అవస్థలు పడ్డాను.

❖ 'జీవితంలో ఎన్ని కష్టాలు, అవరోధాలు ఎదురైనా ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి గురికావొద్దు. విజయం ఎప్పటికైనా సిద్ధిస్తుందనడానికి నా జీవితమే ఉదాహరణ'..అని ఆయన స్పష్టం చేశారు.

గల్ఫ్‌కి పయనం..

డిప్లొమా అనంతరం వివాహం.. కుటుంబ పోషణ కోసం చిన్న ఉద్యోగంలో చేరా. అనంతరం మిత్రుల సూచనతో దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏజెన్సీ మోసంతో అత్తింటి వారు ఇచ్చిన డబ్బు పోగొట్టుకున్నా. మరోసారి ప్రయత్నించి.. సౌదీఅరేబియాకు వెళ్లా. ఆటోమొబైల్ రంగంలో కాకుండా బోర్‌వెల్ రంగంలో పని చేయాల్సి రావడంతో నిరుత్సాహానికి గురయ్యా. దీంతో మూడేళ్ల తర్వాత తిరిగి దేశానికి వచ్చి.. హైదరాబాద్‌లో మకాం పెట్టి.. ఓ కార్ల షోరూంలో సర్వీస్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించా. జీతం సరిపోకపోవడంతో మిత్రులతో కలిసి కార్ల మెకానిక్ షాప్ ప్రారంభించా.

❖ అది బాగానే ఉన్నా.. 2004లో ఏఎంవీఐ ఉద్యోగాల నోటిఫికేషన్ రావడంతో చదువు పూర్తయిన 17 ఏళ్లకు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేశా. ఇంటర్వ్యూతో పోయింది. 2009లో మళ్లీ దరఖాస్తు చేశా. అప్పటికి నా వయసు ప్రభుత్వం ఇచ్చిన కటాఫ్‌కు ఒక నెల మాత్రమే తక్కువ. పలుమార్లు వైద్య పరీక్షలు.. 2012లో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎట్టకేలకు 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించా. మా బ్యాచ్‌లో నేనే ఎక్కువ వయసు వాడిని కాగా.. అతి తక్కువ వయసు నాలో సగం 24 ఏళ్ల వారూ ఉన్నారు.

పల్లెవెలుగులో.. ప్రసవం

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ఓ గర్భిణి ప్రసవించిన ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడువాయి స్టేజి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండకు చెందిన శివవాసి అలివేలు.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వైద్యపరీక్షల నిమిత్తం వెళ్లి, స్వగ్రామానికి కోదాడ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో తాడువాయి స్టేజి వద్దకు బస్సు చేరుకోగానే నొప్పులు వచ్చాయి. ఇది గుర్తించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును పక్కన నిలిపారు. సాధారణ ప్రసవం కావడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. బస్సులో ఉన్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు ప్రథమ చికిత్సను నిర్వహించి తల్లి బిడ్డను జిల్లా జనరల్ వైద్యశాలకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ, అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.



తల్లీ బిడ్డలను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

సంతలో చోరీ చేసిన రూ.10.50 లక్షలు స్వాధీనం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట పశువుల సంతలో ఈ నెల 16న ఓ డీసీఎం వాహనం నుంచి రూ.10.50 లక్షలు చోరీ చేసిన ఇద్దరు నిందితులతోపాటు డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన తాజుద్దీన్ అనే వ్యాపారి పశువుల కొనుగోలుకు తన వెంట తెచ్చుకున్న డబ్బును డీసీఎంలో ఉంచి జీవాల బేరం మాట్లాడేందుకు వెళ్లారు. తిరిగొచ్చి చూస్తే డబ్బు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని భావించి బాధితుడు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వాహన డ్రైవర్లు కోదాడకు చెందిన జావిద్, హయత్ అలీ ఆ డబ్బు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితులిద్దరినీ శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, క్రైం సిబ్బంది కరుణాకర్, కృష్ణ, పాల్గొన్నారు.



సూర్యాపేటలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

సామగ్రి తెచ్చారు.. నిర్మాణం మరిచారు!


నిరుపయోగంగా మ్యాన్‌హోల్స్ రింగులు, కవర్లు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని 32వ వార్డులో అంతర్గత మురుగు కాల్వలు నిర్మించేందుకు తెప్పించిన సామగ్రి నెలల తరబడి నిరుయోగంగా మిగిలింది. పైళ్ల శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలోని పలు వార్డుల్లోని మురుగు కాల్వలపై కప్పు నిర్మించి అంతర్గత మురుగు కాల్వలుగా మార్చారు. అత్యధిక వార్డుల్లో పనులు పూర్తికాగా కొన్ని వార్డుల్లో పనులు అసంపూర్తిగా నిలిచాయి. పనులు మంజూరైన వెంటనే ఆయా వార్డుల కౌన్సిలర్లు గుత్తేదారు వెంట ఉండి పనులు పూర్తి చేయించుకున్నారు. పక్కనే ఉన్న హుస్సేనాబాదులో పనులు పూర్తికాగా చెంతనే ఉన్న ఈ వార్డులో పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. పనులు నిలిచి ఆరునెలలు దాటినా పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ విషయమై పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లును వివరణ కోరగా గత ప్రభుత్వంలో చేపట్టిన పనులను సమీక్షించి పనులు పూర్తి చేసే విషయాన్ని పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

–భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: బొమ్మలరామారం మండలంలోని యావాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రికకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తామని బొమ్మలరామారం విద్యుత్తు ఏఈ సాయిదీప్ వెల్లడించారు.

తిరిగి వెళ్లాల్సిందేనా!


బేగంపేట వాగులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మట్టిమార్గంలో వరద నీరు ప్రవహిస్తూ ఇలా..

రాజపేట, న్యూస్‌టుడే : గంధమల్ల వరద నీరు కారణంగా బేగంపేట, రేణికుంట గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. బేగంపేట వాగులో వంతెన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పక్కనుంచి గుత్తేదారు మట్టిని పోయించి దారి ఏర్పాటు చేశారు. అయితే గంధమల్ల చెరువు అలుగు పోయడమే కాకుండా వరద నీరు వాగులో వెళ్తున్న క్రమంలో ఈ పోసిన మట్టి కొట్టుకుపోయింది. ఫలితంగా ఈ దారి గుండా ప్రయాణం నిలిచిపోయింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మండల పరిషత్, రెవెన్యూ, పోలీసు, ఐబీ అధికారులు ముందస్తుగా ఆ మార్గాన్ని మూసి వేయించారు. ఫలితంగా బేగంపేట వాసులు చల్లూరు, పొట్టిమర్రి నుంచి రాజపేటకు రావాల్సి ఉంటుంది. దారిని పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన

ఆలేరు, న్యూస్‌టుడే: ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి సోకకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆలేరు పశువైద్యాధికారిణి డా.పి.చైతన్య అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రేబిస్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, కుక్క కాటుకు గురైన వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలని తప్పనిసరిగా వైద్యుని సంప్రదించాలన్నారు. వ్యాధి సోకే విధానం, వ్యాధి లక్షణాలు, ప్రథమ చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కళాశాల వ్యవహర్త య.ప్రభాకరాచారి, ప్రిన్సిపల్ శ్రీలంరెడ్డి పాల్గొన్నారు.

ఎంబీసీల అభివృద్ధికి కృషి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ఎంబీసీల సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపేటి జైపాల్ అన్నారు. శనివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంబీసీలోని 36 కులాల అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించనున్నట్లుగా పేర్కొన్నారు. ఎంబీసీలు ఐక్యంగా ఉండాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఆలేరు మార్కెట్ డైరెక్టర్‌గా నియామకమైన శంకర్ల దానయ్యను సన్మానించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లరి మారయ్య, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, నాయకులు శేఖర్, వెంకటేశ్, వెంకటయ్య, యాదగిరి, బాలయ్య పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

భువనగిరి పట్టణం: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు శనివారం పట్టణంలో జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, కార్యదర్శిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా తులసి, మహిళా కార్యదర్శిగా వెంకట లీలావతి, కోశాధికారిగా వెంకటేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా హరిప్రసాద్, శ్రీనివాస్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను పలువురు పూలమాలలతో సత్కరించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులను ఆ గ్రామానికి చెందిన వండేరు సురేశ్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత వైద్యశాల వార్షికోత్సవం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని శ్రీసాయికృష్ణ దంత వైద్యశాల 21వ వార్షికోత్సవాన్ని ఆసుపత్రిలో శనివారం నిర్వహించారు. ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ ఎన్.ప్రసన్నకృష్ణ


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైద్యుడు ప్రసన్నకృష్ణ, తదితరులు

కుటుంబ సభ్యులు, సిబ్బంది మధ్య కేక్ కోశారు. ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.కిషన్, డాక్టర్ వంశీకృష్ణ, కళ్యాణ్ కృష్ణ, డాక్టర్ సంధ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు బాధాకరం

రాజపేట: మహిళల రక్షణకు అనేక చట్టాలు రూపొందించినప్పటికీ తరచూ లైంగిక వేధింపులు, దాడులు జరుగుతుండటం శోచనీయమని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సమావేశం శనివారం జరిగింది. పట్టణ నూతన అధ్యక్షురాలిగా ఆగుళ్ల విజయ, కార్యదర్శిగా గంగోళ్ల శాలిని, ఉపాధ్యక్షురాలిగా సిరియా రాణి, సహాయ కార్యదర్శిగా పబ్బోజు రజిత, కోశాధికారిగా కీర్తనలను ఎన్నుకున్నారు.

సభ్యత్వ నమోదు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలు వెంటనే మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఇటికాల మల్లేశం, మండల అధ్యక్షుడు బిక్షమయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికే కమిటీలు

సంస్థాన్‌నారాయణపురం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరంటోతు శ్రీనునాయక్ తెలిపారు. రాచకొండ ఉమ్మడి గ్రామ పంచాయతీ, వెంకంబావితండాలలో శనివారం బూత్ స్థాయిలో గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేశారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు శిబిరాలు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ దిడ్డి బాలాజీ అన్నారు. పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డైరెక్టర్లు డాక్టర్ జయశ్రీ, రాంబాయి, సిరాజొద్దీన్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

బొమ్మలరామారం,న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ అన్నారు. శనివారం పిల్లిగుండ్లతండాలో వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని, బొమ్మలరామారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని దస్త్రాలను పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సుమలత, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

భారాస నేతకు పరామర్శ

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ భారాస మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్‌గౌడ్ తండ్రి సత్తయ్య గౌడ్ ఇటీవల మృతి చెందారు. శనివారం నిరంజన్‌గౌడ్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలు పరామర్శించారు. వారి వెంట సింగిల్‌విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, సీపీఎం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, చిన్నం బాలరాజు, మాజీ సర్పంచి యాదగిరి, మస్తాన్‌యాదవ్, బాలరాజు, ఆకాష్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.


నిరంజన్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ

బీబీనగర్ : రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో బీబీనగర్ విద్యార్థులు సత్తాచాటారు. స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 జూడో పోటీల్లో బీబీనగర్ విద్యార్థులు నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభను కనబర్చారు. జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. రతన్ సింగ్, మణికంఠ, రమ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు గుజరాత్‌లో అక్టోబర్ 3 నుంచి 7 వరకు జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మాంటిసోరి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు లహరిచంద్ర, తెలంగాణ రాష్ట్ర జూడో కోశాధికారి బాలరాజు, కోచ్ పర్వేజ్ అభినందించారు.

అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన ఆటో

బీబీనగర్, న్యూస్‌టుడే: ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన బీబీనగర్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామంలో వడకల ధనుంజయ తన ఇంటి ముందు వరండాలో కుటుంబ సభ్యులతో కూర్చొని మాట్లాడుతుండగా అతి వేగంగా వచ్చిన ఆటో వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వడకాల జంగమ్మ, బెజవాడ నరసమ్మ, వడకాల అశోక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సహాయంలో వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా, అతి వేగంతో ఆటో నడిపి ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌పై బీబీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనఖీ చేశారు. ధరణి పోర్టల్‌పై రైతుల అభ్యంతరాల పరిశీలన ఎలా జరుగుతుందో తహసీల్దార్ అంజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.


తహసీల్దార్ అంజిరెడ్డితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

లాడ్జిల్లో పోలీసుల సోదాలు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లాడ్జీలను శనివారం యాదగిరిగుట్ట పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గదుల్లో బస చేసిన వారి వివరాలను ఆరా తీశారు. సీసీ కెమెరాలను పరిశీలించి, వాటి పుటేజీలను పరిశీలించారు. లాడ్జి నిర్వాహకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక శక్తులకు బస కల్పించొద్దని సీఐ రమేశ్, ఎస్సై అనిల్‌కుమార్ సూచించారు. నిబంధనలు పాటించని లాడ్జిలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం

ధూల్‌పేట, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై షేక్ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా అర్బన్ కాలనీకి చెందిన ఎం.సందీప్(28) మార్కెటింగ్ ఉద్యోగి. ఈ నెల 27న హైదరాబాద్ అప్పర్ ధూల్‌పేటలోని హజారీ హోటల్ సమీపంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సందీప్

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా వైద్యారోగ్య అధికారి డా.యశోద కోరారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ పురపాలిక పరిధి తంగడపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిత్యం వ్యాయామం, శారీరక శ్రమ చేయాలని, పండ్లు, పీచు ఎక్కువుండే శాకాహారం భుజించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా. సుమన్‌కల్యాణ్, డా.సంపత్, ఆరోగ్య విస్తరణాధికారులు సత్యనారాయణ, ఇస్తారి, శశికళ, ఝాన్సీ పాల్గొన్నారు.


ప్రపంచ గుండె దినోత్సవంలో పాల్గొన్న జిల్లా వైద్యారోగ్య అధికారి డా.యశోద, తదితరులు

హుండీ చోరీకి యత్నం

రాజపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని మఠం వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని దుర్గామాత ఆలయం ఆవరణలోని హుండీ చోరీకి యత్నం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు గోడకు బిగించి ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. తెరుచుకోకపోవడంతో సమీపంలోని ముళ్ల పొదల్లో వదిలి వెళ్లినట్లుగా స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1403 కేసుల పరిష్కారం


చౌటుప్పల్‌లో లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి మహతి వైష్ణవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు 1403 రాజీమార్గంలో పరిష్కరించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. రాజీమార్గమే రాజమార్గమని విస్తృతంగా అవగాహన కల్పించి, న్యాయవాదులు, పోలీసులు సమష్టిగా కృషి చేసి అత్యధిక కేసులను పరిష్కరించినట్టు ఆమె తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాజామొహినుద్దీన్, ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్, రూరల్ సీఐ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాడూరి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. రామన్నపేటలో కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మజీద్, జినుకల ప్రభాకర్, లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, డేవిడ్, రమేశ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం: చిన్న చిన్న కేసుల విషయంలో రాజీ మార్గం ఎంచుకోవడం సరైందని, అదే రాజ మార్గమని యాదగిరిగుట్ట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సూర సుమలత సూచించారు. శనివారం న్యాయస్థానంలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. రాజీ మార్గం ద్వారా కక్షిదారులు ఇరువురు గెలిచినట్లేనని, దీని వల్ల కోర్టు చుట్టూ తిరగకుండా సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి సుదగాని శ్రీహరి, న్యాయవాదులు రమేశ్, సాయికృష్ణ, సంతోష, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భారాస అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎనిమిది వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేస్తామన్నారు. 10, 27, 28 వార్డుల్లో మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి, ఇన్‌ఛార్జి డీఈ కొండల్‌రావు, కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్ కుమార్, ఖైరంకొండ వెంకటేష్, ఖాజా అజీమొద్దీన్, నాయకులు మజహర్, చిక్కుల వెంకటేశం, బెండె శ్రీకాంత్, సలావొద్దీన్ పాల్గొన్నారు.

భాజపా ప్రజాప్రతినిధుల నిరసన.. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు పిలిచి అవమానించారని ఆరోపిస్తూ భాజపా ప్రజాప్రతినిధులు 13వ వార్డులో శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాయ దశరథ, వార్డు కౌన్సిలర్ జనగాం కవిత మాట్లాడుతూ.. రెండు గంటలు వేచి చూసినప్పటికీ అలస్యంగా వచ్చి తమను పిలవకుండానే పనులకు శంకుస్థాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మెప్పుపొందేందుకు ఛైర్మన్, కమిషనర్ తమను చిన్నచూపుగా చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రత్నపురం బలరాం, నాయకులు జనగాం నర్సింహాచారి, నీలం రమేష్, పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నీటి కల్పనే లక్ష్యం: ప్రభుత్వ విప్


బొందుగుల ఊర చెరువులోకి నీరొచ్చేందుకు గేటువాల్వును తిప్పుతున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

రాజపేట, న్యూస్‌టుడే : ఆలేరు నియోజకవర్గానికి శాశ్వత సాగునీటి కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల పరిధిలోని తపాసుపల్లి జలాశయం నుంచి రాజపేట, ఆలేరు మండలాలకు శాశ్వత సాగునీరు అందించే విషయమై శనివారం ఐబీ అధికారులు, నాయకులతో కలిసి క్షేత్ర సందర్శన చేపట్టారు. తాత్కాలికంగా బొందుగుల ఊర చెరువులోకి నీరు వచ్చేందుకు గేటువాల్వు ఎత్తారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొందుగుల చెరువులోకి నీరు రావడంతో గొలుసుకట్టు చెరువుల ద్వారా ఆలేరు, గుండాల, మోత్కూరు ప్రాంతాలకు కూడా నీటి ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం రాజపేట మండలంలోని చెరువులోకి తపాసుపల్లి జలాలు వచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నాయకులు మహేందర్‌గౌడ్, బుడిగె పెంటయ్య, నరేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


భువనగిరిలో జరిగిన భారతీయ కిసాన్ సంఘ్ సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

భువనగిరి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సమావేశంలో పట్టణంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు పోగల యాదగిరి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఐలేష్‌కుమార్, సభ్యత్వ జిల్లా ప్రముఖులు రవీందర్, అంజిరెడ్డి, పాపిరెడ్డి, సుధీర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన

భువనగిరి, న్యూస్‌టుడే: రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలు మార్చాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు మహేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు యాదయ్య మాట్లాడుతూ.. అశాస్త్రీయంగా జరుగుతున్న రేషనలైజేషన్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. యూఎస్‌పీసీ సభ్యులు లక్ష్మీనరసింహారెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, కృష్ణమూర్తి, రమణారావు, లింగయ్య, బాలయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూఎస్‌పీసీ సభ్యులు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తాం: ఎమ్మెల్యే సామేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: సింగిల్‌విండో కార్యాలయంలో రుణాలు తీసుకున్న రైతులు సరైన సమయంలో చెల్లించి సంఘాన్ని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీకి సర్వే జరుగుతోందని, రూ.రెండు లక్షలకు పైగా బ్యాంకులో అప్పు ఉన్నవారు, పై మొత్తాన్ని చెల్లిస్తే అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు. గంధమల్ల ప్రాజెక్టు నుంచి మోత్కూరు బిక్కేరు వాగులోకి రెండుమూడు రోజుల్లో గోదావరి జలాలు వస్తాయన్నారు. సమావేశంలో ఛైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చేడె చంద్రయ్య, సీఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

❒ చిర్రగూడూరులో ఇటీవల మృతిచెందిన జూనియర్ లైన్‌మెన్ షేక్ మోసిన్‌పాషా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

సామగ్రి పంపిణీ

భువనగిరి పట్టణం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు హ్యాండ్ గ్లౌజెస్, మాస్క్, హెల్మెట్‌లు, రేడియం జాకెట్లు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ రజిత, కార్మికులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం నేటి తరాలకు స్ఫూర్తి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, నాయకులు కర్రె శ్రీశైలం, లక్ష్మణ్, మల్లయ్య, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్, పోలేపాక యదయ్య, సత్యనారాయణ, సాయిని యాదగిరి, సాయికుమార్ పాల్గొన్నారు.


వలిగొండలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుర్కపల్లి: తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్, శేఖర్‌నాయక్, హరిశంకర్, తిరుపతినాయక్, శ్రీనునాయక్, సుధాకర్‌నాయక్, రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిల చెల్లింపునకు డిమాండ్

భువనగిరి, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

ధాన్యం బిల్లులు ఆలస్యమైతే కమీషన్ ఇవ్వొద్దని తీర్మానం

మోత్కూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్లో ధాన్యం అమ్మిన రైతులకు ఖరీదుదారులు నాలుగు రోజుల్లోపు డబ్బు చెల్లించాలని, 20 రోజులు దాటితే ఖరీదుదారులకు కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదని శనివారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు. సింగిల్‌విండో ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, ఖరీదుదారులు బుస్స శ్రీనివాస్, మిట్టపల్లి నగేష్, గుజ్జ సతీష్, సోమ వెంకన్న, జి.రంగయ్య, రైతులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో రైతు సంక్షేమం కోసం పలు తీర్మానాలను ఆమోదించారు. ఆ సంఘం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఆదాయ, వ్యయాలపై సమీక్షించారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, సంఘం ఉపాధ్యక్షుడు చెన్నగోని అంజయ్యగౌడ్, డైరక్టర్లు బోరెం నర్సిరెడ్డి, రూపమ్మ, కృష్ణ, వెంకటయ్య, శ్రీశైలం, పద్మ, శశిధర్‌రెడ్డి, బాలరాజు, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ ఎంపీడీవోగా బి.యాకోబు నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపీడీవో సందీప్ కుమార్ సెలవుపై వెళ్లడంతో సంస్థాన్ నారాయణపురం ఎంపీడీవో కె.ప్రమోద్‌కుమార్‌కు ఇక్కడి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. అతను కూడా సెలవు తీసుకోవడంతో రామన్నపేట ఎంపీడీవో యాకోబు నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

యాసంగి పంటలపై రైతులకు శిక్షణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో మండలంలోని నాగిరెడ్డిపల్లిలో 'యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలు' అనే అంశంపై శనివారం శిక్షణ ఏర్పాటు చేశారు. అధిక దిగుబడి సాధించే విధంగా మెలకువలను తెలిపారు.